# తెలంగాణకు 22 పోలీస్ సేవా మెడల్స్

- 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటించిన కేంద్రం
- ఆరు గ్యాలెంటరీ మెడల్స్, రెండు రాష్ట్రపతి పతకాలు, 12 ఉత్తమ ప్రతిభా పతకాలు, రెండు కరెక్షనల్ సర్వీసెస్ మెడల్స్
- ఆయా శాఖలకు చేరిన సర్టిఫికెట్లు

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం గ్యాలెంటరీ అవార్డులను గురువారం ప్రకటించింది. పోలీస్, ఫైర్ సర్వీస్, హోంగార్డ్, సివిల్ డిఫెన్స్, కరెక్షనల్ సర్వీస్ విభాగాల్లో దేశవ్యాప్తంగా 1,132 మంది సిబ్బందికి గ్యాలెంట్రీ/సర్వీస్ మెడల్స్‌ను ప్రకటించింది. ఇందులో తెలంగాణ రాష్ట్రానికి 22 సేవా పతకాలు లభించాయి. వీటిలో ఆరు గ్యాలెంటరీ మెడల్స్, రెండు రాష్ట్రపతి పతకాలు, 12 ఉత్తమ ప్రతిభా పతకాలు, రెండు కరెక్షనల్ సర్వీసెస్ మెడల్స్ ఉన్నాయి. ఇప్పటికే ఆయా శాఖలకు రాష్ట్రపతి ఆఫీసు నుంచి సర్టిఫికెట్లు వచ్చాయి. వాటిని గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయా విభాగాధిపతులు అందించనున్నారు. డీజీపీ ఆఫీసుకు వచ్చే మెడల్స్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా అందుకోనున్నారు.




పౌర సరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌కు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డును అందజేస్తున్న గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, చిత్రంలో సీఈవో వికాస్‌రాజ్

## డీఎస్ చౌహాన్‌కు రెండు అవార్డులు

సీనియర్ పోలీస్ అధికారి, పౌర సరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌కు ఒకేరోజు రెండు అత్యుత్తమ అవార్డులు లభించాయి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం కేంద్రం ప్రకటించే రాష్ట్రపతి విశిష్టసేవా పతకానికి డీఎస్ చౌహాన్ ఎంపికయ్యారు. బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు (2024) కూడా ఆయనకు లభించింది. రాచకొండ పోలీస్ కమిషనర్‌గా 2023 శాసనసభ ఎన్నికలను సజావుగా, సమర్థంగా నిర్వహించినందుకు ఎన్నికల సంఘం ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ అవార్డును గురువారం జేఎన్టీయూలో నిర్వహించిన ఓటర్స్ డే సెలబ్రేషన్స్‌లో గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ నుంచి అందుకున్నారు. ఒకే రోజు రెండు అవార్డులు రావడం పట్ల పౌరసరఫరాలశాఖ ఉద్యోగులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. సమిష్టి కృషి వల్లే ఇది సాధ్యమైందని డీఎస్ చౌహాన్ పేర్కొన్నారు.

## బావిశెట్టి చంద్రశేఖర్‌కు పరమ విశిష్ట సేవా పతకం

*హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ):1984 నుంచి ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు విశేష సేవలందించిన ఎయిర్ మార్షల్ (రిటైర్డ్) బావిశెట్టి చంద్రశేఖర్‌కు పరమ విశిష్ట సేవా పతకం వరించింది. తెలంగాణలోని దుండిగల్ ఎయిర్ ఫోర్స్ సెంటర్‌కు కమాండెంట్‌గా విశేష సేవలందించిన చంద్రశేఖర్ గత నవంబర్‌లో పదవీ విరమణ పొందారు. 1984 డిసెంబర్ 21న హెలికాప్టర్ పైలట్‌గా భారత వైమానిక దళం ఫ్లయింగ్ బ్రాంచ్‌లో నియమితులయ్యారు. నాటి నుంచి దేశంలోని అన్ని ప్రాంతాల్లో ఐఏఎఫ్ ఇన్వెంటరీలో ఎన్నో రకాల హెలికాప్టర్లను 5,400 గంటలకు నడిపిన అనుభవం ఆయనది. 2008లో చంద్రశేఖర్ సేవలను చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ ప్రశంసించింది. 2020లో భారత రాష్ట్రపతి అతి విశిష్ట సేవా పతకాన్ని (ఏవీఎస్ఎం) అందుకున్నారు. ఇప్పుడు పరమ విశిష్ట సేవా పతకం (పీవీఎస్ఎం) రావడం పట్ల ఆనందంగా ఉన్నదని, తన సేవలను భారత వైమానిక దళం గుర్తించిందని చంద్రశేఖర్ ఆనందం వ్యక్తం చేశారు.*

### గ్యాలెంట్రీ మెడల్ అందుకొనేవారు..

1) వడిచర్ల శ్రీనివాస్ జేసీ/పీసీ
2) నలివేణి హరీశ్ జేసీ/పీసీ
3) గడ్డిపోగుల అంజయ్య ఏఏసీ/ఆర్ఎస్
4) బూర్క సునీల్‌కుమార్ జేసీ/పీసీ
5) ఎండీ అయూబ్ జేసీ/పీసీ
6) పీ సతీశ్ జేసీ/పీసీ

### రాష్ట్రపతి విశిష్టసేవా పతకం అందుకొనేవారు..

1) దేవేంద్రసింగ్ చౌహాన్, ఏడీజీ
2) సౌమ్యమిశ్రా, ఏడీజీ

### మెరిటోరియస్ సర్వీస్ మెడల్ అందుకొనేవారు..

1) పరిమళ హనా నూతన్, డీఐజీ
2) డీ చంద్రయ్య, అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్
3) కొక్కు వీరయ్య, అడిషనల్ కమాండెంట్ 8వ బెటాలియన్
4) నరుకుళ్ల త్రినాథ్, కమాండెంట్
5) నూకల వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్
6) పింగిళి నరేశ్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్
7) శ్రీరాముల మోహన్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్
8) బెల్లం జయచంద్ర, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్
9) ఎనుమల వెంకటరెడ్డి, అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్
10) గండిపూడి యేసుపాదం, అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్
11) జంగయ్య, హెడ్ కానిస్టేబుల్
12) మంచిరేవుల సురేందర్‌రెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్

### కరక్షనల్ సర్వీసెస్ మెడల్స్ అందుకొనేవారు..

1) శ్రీధర్ ఆర్కాట్, జైల్ డిప్యూటీ సూపరింటెండెంట్
2) రామయ్య యడారి, జైలర్

# ఓటర్లను బెదిరించవద్దు

- *ఓటు ప్రజల చేతుల్లో ఆయుధం*
- *14వ జాతీయ ఓటర్ల దినోత్సవంలో గవర్నర్*
- *ఫిబ్రవరి 8 నాటికి ఓటర్ల తుది జాబితా*
- *రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ వెల్లడి*

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 25 (నమస్తే తెలంగాణ)/కేపీహెచ్‌బీ కాలనీ: ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ఓటు హక్కు ప్రజల చేతుల్లో ఆయుధంలాంటిదని, కొత్తగా ఓటు హక్కు పొందిన యువత ఓటు వేయడాన్ని గర్వంగా భావించాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ ఉద్బోధించారు. నగరంలోని జేఎన్‌టీయూలో 14వ జాతీయ ఓటర్ల దినోత్సవానికి గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటు ప్రాధాన్యతను వివరించారు. ఎన్నికల్లో తనకు ఓటు వేయకపోతే ఆత్మహత్య చేసుకుంటానని ఓ అభ్యర్థి బెదిరించారని, ఎన్నికల కమిషన్ అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, వికలాంగులకు మొదటిసారి హోం ఓటింగ్ నిర్వహించారని, ఈ ఎన్నికలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శవంతంగా నిలిచాయని అన్నారు. నోటాకు తాను వ్యతిరేకమని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషనర్ పార్థసారథి మాట్లాడుతూ.. అబ్రహాంలింకన్ అన్న బుల్లెట్ కన్నా ఓటు బలమైనది అన్న మాటను గుర్తు చేశారు. ప్రస్తుతం ఓటు శాతం గ్రామీణ ప్రాంతాల్లో పెరగగా.. హైదరాబాద్ వంటి పట్టణాల్లో తగ్గిందని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గ్రామాలు, పట్టణాల్లో ఓటింగ్ శాతం పెరిగేందుకు మరింత కృషి చేస్తామని చెప్పారు.

**లోకసభ ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతున్నాం: వికాస్‌రాజ్**

తెలంగాణలో లోకసభ ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతున్నామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ పేర్కొన్నారు. ఫిబ్రవరి 8న ఓటర్ల తుది జాబితాను ప్రకటించనున్నట్టు తెలిపారు. గత ఏడాది కొత్తగా 18 సంవత్సరాలు నిండిన వారు 9,99,667 ఓటర్లు నమోదైనట్టు వివరించారు. ఈ ఏడాది ఇప్పటివరకు 7.50 లక్షల మంది ఓటర్లుగా నమోదయ్యారని తెలిపారు. అర్హులైన వారంతా ఆన్‌లైన్‌లో, బీఎల్‌ఓల ద్వారా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని వికాస్‌రాజ్ కోరారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఢిల్లీ నుంచి సందేశం ఇచ్చారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అయా జిల్లా కలెక్టర్లు, అధికారులు, ఆయా పోటీల్లో విజేతలైన పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలను గవర్నర్ అందచేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ సీఈవో లోకేశ్‌కుమార్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్, మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి , జోనల్ కమిషనర్లు స్నేహ శబరీష్, అభిలాష అభినవ్, వెంకటేశ్ దొత్రే, రవి కిరణ్, పంకజ, తదితరులు పాల్గొన్నారు.

## 'జీవన్ రక్షా పదక్' అవార్డుకు ఖమ్మం వాసి

*హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): వివిధ రంగాల్లో ధైర్యసాహసాలు ప్రదర్శించిన 31 మందికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవన్ రక్షా పదక్ సిరీస్ అవార్డ్స్‌ను అందించనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మకమైన అవార్డుకు ఖమ్మం జిల్లాకు చెందిన పోలీస్ డ్రైవర్ (ఎస్సై) డీ నవీన్‌కుమార్ ఎంపికయ్యారు. ఖమ్మం జిల్లా చీమలపాడులో సంభవించిన గ్యాస్ పేలుడులో ఎడమకాలు కోల్పోయి.. 40 మందిని అగ్నిప్రమాదం నుంచి కాపాడారు.*

# 300 కోట్లకుపైగా అక్రమాస్తులు

- హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ అరెస్టు
- 14 రోజుల రిమాండ్ విధించిన నాంపల్లి కోర్టు
- 16 ప్రాంతాల్లో 24 గంటల పాటు ఏసీబీ సోదాలు
- రూ.99.60 లక్షల నగదు, 2 కిలోల బంగారం, 6 కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం

మణికొండ/నాంపల్లి కోర్టు/హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ అక్రమాస్తుల విలువ రూ.300 నుంచి రూ.400 కోట్లకుపైగానే ఉన్నట్టు అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) అధికారులు అంచనా వేశారు. 24 గంటలపాటు 16 ప్రాంతాల్లో విస్తృతంగా సోదాలు నిర్వహించి గురువారం తెల్లవారుజామున 3 గంటలకు అతడిని అరెస్టు చేశారు. సుమారు 12 గంటల పాటు ఏసీబీ అధికారులు పలు కోణాల్లో విచారించినా శివబాలకృష్ణ నోరు విప్పలేదు. దీంతో నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపర్చగా, ఫిబ్రవరి 8 వరకు 14 రోజుల పాటు కోర్టు రిమాండ్ విధించింది. ఈ సందర్భంగా ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సుధీంద్ర కేసు వివరాలను వెల్లడించారు. శివబాలకృష్ణ ఇల్లు, బంధువులు, స్నేహితుల ఇండ్లలో 16 చోట్ల సోదాల అనంతరం మొత్తం రూ.99,60,850 నగదు, 1,988 గ్రామాలు బంగారు, వజ్రాభరణాలు, సుమారు 6 కిలోల వెండి నగలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. దాదాపు రూ.5,96,27,495 విలువైన చర, స్థిర ఆస్తులను కనుగొన్నట్టు వెల్లడించారు. సోదాల్లో దొరికిన మొత్తం స్థిర, చర ఆస్తులు ప్రభుత్వ విలువ ప్రకారం రూ.8,26,48,999 అని, బయటి మార్కెట్‌లో వాటి విలువ రూ.వందల కోట్లు ఉంటుందని అంచనా వేశారు. ఇంకా అదనపు ఆస్తులకు సంబంధించిన వెరిఫికేషన్ జరుగుతున్నదని వివరించారు. ఏసీబీ యాక్ట్‌లోని యూ/ఎస్ 13(1)(బీ), 13(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు తెలిపారు. కేసు విచారణలో ఉన్నదని, ఏసీబీ రిమాండ్ కోసం తర్వలో పిటిషన్ వేయనున్నట్టు పేర్కొన్నారు.

### బినామీల పేరుతో స్థిరాస్తులు

హెచ్‌ఎండీఏ మాజీ ప్లానింగ్ డైరెక్టర్, ప్రస్తుతం మెట్రో రైల్ ప్లానింగ్ ఆఫీసర్, రెరా సెక్రటరీగా కొనసాగుతున్న శివబాలకృష్ణకు బినామీల పేర్లతో లెక్కకు మించిన స్థిరాస్తులు ఉన్నట్టు ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సుధీంద్ర తెలిపారు. హైదరాబాద్‌లో విల్లాలు, ఫ్లాట్లతో పాటుగా శివారు ప్రాంతాల్లో ఎకరాలకొద్దీ భూములు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లోనే దాదాపు 90 ఎకరాల ల్యాండ్ పత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. కొడకండ్లలో 17ఎకరాలు, కల్వకుర్తిలో 26 ఎకరాలు, యాదాద్రిలో 23 ఎకరాలు, జనగామలో 24 ఎకరాలకు సంబంధించిన పత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. ఈ భూములన్నీ బినామీల పేరుతో ఉన్నట్టు అధికారులు గుర్తించారు. 80కిపైగా ఖరీదైన వాచ్‌లు, పదుల సంఖ్యలో ఐఫోన్లు, బంగారు వెండి ఆభరణాలతో పాటు, భారీగా వజ్రాలు స్వాధీనం చేసుకున్నారు. పలు కంపెనీల్లో శివబాలకృష్ణ పెట్టుబడులు సైతం పెట్టినట్టు ఏసీబీ అధికారులు తేల్చారు. మణికొండ, పుప్పాలగూడ పరిధిలోని మూడు నిర్మాణరంగ సంస్థల్లో పెట్టుబడులను పెట్టినట్టు వెల్లడించారు. త్వరలో ఆ సంస్థల్లోనూ దాడులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

### స్థానిక నిర్మాణరంగ సంస్థల్లో వణుకు

శివబాలకృష్ణ అక్రమాస్తుల వ్యవహారంలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి రావటంతో మణికొండ, నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని పలు నిర్మాణరంగ సంస్థల్లో వణుకు మొదలైంది. బాలకృష్ణ అక్రమాస్తులకు ఆజ్యంపోసిన ఈఐపీఎల్ లాంటి కొన్ని సంస్థలపై ఏబీసీ అధికారులు ఏ మేరకు చర్యలు తీసుకుంటారోనని ఆందోళనలో పడ్డారు. ఈ సంస్థలకు చెందిన పలువురు బిల్డర్లు అంతా కలిసి పుప్పాలగూడలోని ఆదిత్య ఫోర్టులో విల్లా కొనుగోలు చేసి బాలకృష్ణకు గిఫ్ట్‌గా ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. బాలకృష్ణ ఏ కంపెనీలకు, ఎవరెవరికి అనుమతులు ఇచ్చేందుకు ఎంతస్థాయిలో ముడుపులు తీసుకున్నారన్న విషయాలపై.. బంధువులు, మిత్రుల పేర్లతో పాటు 6 నెలలుగా ఫోన్ల సంభాషణలపై ఏసీబీ విచారణ ప్రారంభించినట్టు సమాచారం. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఓ సంస్థ అక్రమ నిర్మాణాల కోసం బాలకృష్ణకు ఏకంగా భూములను కొనిచ్చినట్టు తెలిసింది. మంచిరేవుల, గండిపేట, నార్సింగి ప్రాంతాల్లో బాలకృష్ణ ఖరీదైన విల్లాలను కొనుగోలు చేసినట్టు తెలిసింది. వీటిని వెనుక స్థానిక నిర్మాణ రంగ సంస్థలు పని చేశాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## నేడు మద్యం దుకాణాల బంద్

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ) : గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు బంద్ కానున్నాయి. మాంసం దుకాణాలు కూడా మూతపడనున్నాయి. తిరిగి శనివారం ఇవన్నీ తెరుచుకోనున్నాయి. ఈ విషయం తెలుసుకొన్న మందుబాబులు గురువారం ఉదయం నుంచే క్యూలో నిలబడి మరీ మద్యాన్ని కొనుగోలు చేశారు.

## బీఆర్ఎస్‌కు భూమి కేటాయింపుపై మరో పిటిషన్

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ కోకాపేటలో 11 ఎకరాల భూమిని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి కేటాయిస్తూ గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన మరో పిటిషన్‌ను హైకోర్టు విచారణకు స్వీకరించింది. పిటిషన్‌కు నెంబర్ కేటాయించాలని హైకోర్టు రిజిస్ట్రీకి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం ఆదేశాలు జారీ చేసింది. గండిపేట మండలం కోకాపేటలోని 239, 240 సర్వే నెంబర్లల్లోని 11 ఎకరాల భూమిని బీఆర్ఎస్ పార్టీకి కేటాయించడాన్ని సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది వెంకట్రామిరెడ్డి ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. బీఆర్ఎస్‌కు భూమి కేటాయింపును రద్దు చేయాలంటూ గతంలో ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ దాఖలు చేసిన వ్యాజ్యంతో కలిపి ఈ పిల్‌ను విచారిస్తామని కోర్టు ప్రకటించింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ పిల్‌కు నెంబర్ కేటాయించేందుకు గతంలో రిజిస్ట్రీ లేవనెత్తిన అభ్యంతరాలను హైకోర్టు పక్కకుపెట్టింది. నెంబర్ కేటాయించి ప్రతివాదులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించింది.

